అరకొరగానే కృష్ణా జలాలు

నాలుగు నెలలుగా పాలేటి నీరే గతి
పంప్‌హౌస్ వద్ద సరిపోని పైపులైన్ సామర్థ్యం
తీవ్ర ఇబ్బందుల్లో జగ్గయ్యపేట వాసులు
చోద్యం చూస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేటకు తాగునీటిని అందించే హెడ్‌వాటర్ వర్క్స్(పంప్‌హౌస్)లో మోటార్ల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటంతోపాటు మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో కృష్ణా జలాలు పూర్తిగా అందడం లేదు. మున్సిపల్ చైర్మన్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాలుగునెలలుగా జగ్గయ్యపేట ప్రజలకు పాలేరు నీరే గతి అయ్యింది.


పేటలోని హెడ్‌వాటర్ వర్క్స్ పంప్‌హౌస్

కలుషితమవుతున్న పాలేటి నీరు..

ప్రస్తుతం పట్టణ ప్రజలకు 50శాతం కృష్ణా జలాలు, 50 శాతం పాలేటి నీటిని సరఫరా చేస్తున్నారు. పాలేటి నీటిని గతంలో హెడ్‌వాటర్ వర్క్స్‌లో క్లోరినేషన్, ఫిల్టరైజేషన్ చేసి సరఫరా చేసేవారు. చుట్టుప్రక్కల ఉన్న ఫ్యాక్టరీలు వాటి వ్యర్థాలను పాలేటిలోకి వదులుతుండటంతో కొన్నేళ్లుగా పాలేరు కలుషితంగా మారింది. ఈ నీటిని తాగేవారు వ్యాధుల బారిన పడుతుండటంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు ముక్త్యాల వద్ద నుంచి కృష్ణాజలాలు అందించాలని ప్రతిపాదించారు. ముక్త్యాల వద్ద కృష్ణానది నుంచి పైపులైన్ ద్వారా కృష్ణా జలాలను జగ్గయ్యపేట పట్టణానికి సుమారు 10కిలోమీటర్ల మేర తీసుకువచ్చి, పద్మావతినగర్ వద్ద ఉన్న హెడ్‌వాటర్‌వర్క్స్‌లో నీటిని వివిధ దశల్లో శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా రిజర్వాయర్లకు, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా పట్టణ ప్రజలకు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో రూ.18.90కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసిన 2020 డిసెంబర్ 12న జగ్గయ్యపేట ప్రజలకు కృష్ణా జలాల సరఫరా చేపట్టారు.


హెడ్‌వాటర్ వర్క్స్‌లో ప్రస్తుతం ఉన్న 8 అంగుళాల పైపులు

మున్సిపల్ పాలకుల వైఫల్యం..

60 వేలకు పైగా జనాభా ఉన్న జగ్గయ్యపేట ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలను అందించేందుకు కృష్ణాజలాల ప్రాజెక్టు నిర్వహణ కాంట్రాక్టును పురపాలక సంఘం వారు కోయా కంపెనీకి అప్పగించారు. అయితే నాలుగు నెలలుగా సదరు కంపెనీ నిర్వహణ లోపభూయిష్టంగా మారింది.


ముక్త్యాలలోని రా వాటర్ పంప్‌హౌస్

హెడ్‌వాటర్ వర్క్స్‌లో ఫిల్టర్ బెడ్ నుంచి సంపులోకి వెళ్లిన నీటిని తోడే మోటార్లకు ఉండే ప్రధాన పైపుల సామర్థ్యం సరిపోవడం లేదు. ప్రధాన పైపులైన్‌కు పలు చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. ముక్త్యాలలో నది ఒడ్డున ఉన్న రా వాటర్ పంప్ హౌస్‌లో రెండు మోటార్ల నుంచి వచ్చే నీటికి 8 అంగుళాల పైపుల సామర్థ్యం సరిపోకపోవడం లేదు. ముక్త్యాల వద్ద రెండు మోటార్లకు బదులు ఒకటే మోటార్ పనిచేస్తోంది. ముక్త్యాలలో రెండు మోటార్లు పనిచేయాలంటే, ఇక్కడ హెడ్‌వాటర్ వర్క్స్‌లో 8 అంగుళాల పైపుల స్థానంలో 12 అంగుళాల పైపులతో పాటు 60 హెచ్‌పీ, 40 హెచ్‌పీ మోటార్లకు అమర్చాల్సి ఉంది.

పైపులైన్లకు లీకేజీలు..

అదేవిధంగా కృష్ణానది నుంచి వచ్చే హెడ్‌వాటర్‌వర్క్స్‌కు వచ్చే ప్రధాన పైపులైన్, పంప్‌హౌస్ నుంచి పేట పట్టణానికి వెళ్లే పైపులైన్లకు పలుచోట్ల లీకేజీలు


రా వాటర్ పంప్‌హౌస్‌లో సజావుగా పనిచేస్తున్నది ఒక్క మోటార్‌నే

ఉన్నాయి. వాటిని తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారే తప్ప, శాశ్వత ప్రాతిపదికన పనులు పూర్తిచేయడం లేదు. దీంతో పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో కృష్ణాజలాలు అందడం లేదు. ఈ సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర వైఫల్యం చెందారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కూడా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే తగిన చర్యలు చేపట్టి పూర్తిస్థాయిలో కృష్ణాజలాలు సరఫరా అయ్యేలా చూడాలని జగ్గయ్యపేట పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పాలేటి నీటినే తాగుతున్నాం...



నాలుగైదు నెలలుగా కృష్ణా జలాలను సరిగా సరఫరా చేయడం లేదు. పాలేటి నీరు కూడా సరఫరా చేస్తున్నారు. ఫ్యాక్టరీల వ్యర్థాలు కలిసే పాలేటి నీటిని తాగలేక ఇబ్బందిపడుతున్నాం. పట్టణ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పూర్తిస్థాయిలో కృష్ణా జలాలను సరఫరా చేయాలి.

– ఉప్పెల్లి ప్రసన్నకుమార్, విలియంపేట వాసి.

చైర్మన్, ఎమ్మెల్యే దృష్టి పెట్టాలి...



హెడ్‌వాటర్ వర్క్స్ పంప్ హౌస్‌లో మోటార్లు, పైపులైన్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కృష్ణాజలాలను తీసుకురాగా నేటి పాలకులు ప్రజలకు సజావుగా నీటిని సరఫరా చేయలేకపోతున్నారు. చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తగిన చర్యలు చేపట్టి ప్రజలకు కృష్ణాజలాలు అందించాలి.

– షేక్ హఫీజున్నీసా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్

టెండర్లు పిలిచాం...



హెడ్ వాటర్‌వర్క్స్‌లో 8 అంగుళాల పైపుల స్థానంలో 12 అంగుళాల పైపులు ఏర్పాటు కోసం టెండర్లు పూర్తయ్యాయి. కృష్ణా జలాల కోసం ప్రత్యేక పంప్‌హౌస్, సంపు సిస్టం కావాల్సి ఉంది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పథకం కింద వచ్చే నిధులు నిలిచిపోయాయి. కొత్త పంప్‌హౌస్ కోసం ఎమ్మెల్యే తాతయ్య డీఎంహెచ్‌వో ఫండ్స్ కోసం కృషి చేస్తున్నారు.

– ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ కమిషనర్.

క్లుప్తంగా

గండేపల్లిలో శానిటేషన్ పనులు



గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లిలో మంగళవారం శానిటేషన్ పనులు చేపట్టారు. డ్రైయినేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించటంతోపాటు మురుగు నీరు పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈసందర్భంగా సర్పంచ్ బొక్కా రవికుమార్ మాట్లాడుతూ డ్రైయినేజీల్లో బ్లీచింగ్, సున్నం చల్లిస్తున్నామన్నారు. గ్రామస్తులు రోగాలబారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిత్యం ప్రజలకు రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

24న యూటీఎఫ్ జిల్లా ప్రథమ మహాసభ



వీరులపాడు(కంచికచర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందని ఆసంఘం వీరులపాడు మండల ప్రధాన కార్యదర్శి కామా ప్రభాకర్ అన్నారు. వీరులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూటీఎఫ్ మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 24న విజయవాడ ఎంబీ విజ్ఞానకేంద్రంలో జిల్లా యూటీఎఫ్ ప్రథమ మహాసభ జరుగుతుందన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు డీ హరిప్రసాద్, కే శ్యాం ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, వెంకటనారాయణ, గాలీబ్‌షా తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నందిగామటౌన్: వాహనదారులు లైసెన్స్, ఇన్సూరెన్స్‌లతోపాటు వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను సకాలంలో రెన్యూవల్ చేయించుకోవాలని నందిగామ ఎస్ఐ అభిమన్యు సూచించారు. పట్టణంలోని చందర్లపాడు రోడ్డులో మంగళవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ వాడకం, ఇన్సూరెన్స్ ఆవశ్యకతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి అన్నారు. ఇన్సూరెన్స్ ఉంటే ప్రమాద సమయంలో బాధితులకు ఆర్థికంగా అండగా ఉంటుందని తెలిపారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించకుంటే చర్యలు తప్పవని చెప్పారు. అనంతరం నిబంధనలను పాటించని పలువురు ద్విచక్రవాహనదారులకు జరిమానా విధించారు.

25న కోటి దీపోత్సవం

నందిగామ టౌన్: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా వాసవీ మార్కెట్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న సామూహిక కార్తిక కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు గౌరిపెద్ది రామకృష్ణ శేషసాయి మంగళవారం తెలిపారు. పదేళ్లుగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతోపాటు వీరులపాడు మండలం నరసింహారావుపాలెంలో అగస్త్య పీఠాధిపతి సుగుణానంద మహర్షి ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముఖ్యంగా 458 మంది దంపతులచే నిర్వహిస్తున్న కోటి దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మంత్రికి వినతిపత్రం అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని ధనంబోడుపై ఉన్న బౌద్ధస్తూపాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కోరారు. ఈ మేరకు మంత్రి కందుల దుర్గేష్‌ను ఎమ్మెల్యే మంగళవారం అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆయన కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ధనంబోడుపై బౌద్ధస్తూపం, అక్కడ మిగిలిఉన్న శిధిల శిల్పాలు, శిలాఫలకాల చుట్టూత ప్రహరీ, ఉద్యానవనం ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే కోరారు. బౌద్ధ స్తూప విశేషాలతో కూడిన ఫొటో గ్యాలరీ మ్యూజియం, ధ్యాన మందిరం, పైకి అప్రోచ్ రోడ్డు, చెరువులో బోటు షికారు, సందర్శకులకు రిసార్ట్ హోటల్ ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

వెట్టిచాకిరి చేయిస్తే కఠిన చర్యలు



నందిగామటౌన్: బాలకార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ డివిజన్ అసిస్టెంట్ లేబర్ అధికారి రాజకుమారి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాణి హెచ్చరించారు. నేషనల్ కమిషన్ ఆఫ్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఆదేశాలతో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నందిగామలోని పలు దుకాణాలు, వ్యాపార సముదాయాలను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వారిని పనిలో పెట్టుకుంటే ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.20 వేల జరిమానా విధిస్తామన్నారు. చిన్నారులు తమ బాల్యాన్ని పాఠశాలల్లో గడపాలి తప్ప వెట్టిచాకిరీకి బలి కాకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందిగామ అసిస్టెంట్ లేబర్ అధికారి రాజేంద్రపౌలు, న్యాయవాదులు హనుమంతరావు, ఆజాద్, తారాసింగ్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం


పెనుగంచిప్రోలులో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీపీ గాంధీ తదితరులు

పెనుగంచిప్రోలు(వత్సవాయి):ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీపీ మార్కపూడి గాంధీ మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు కృషిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కష్టాన్ని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. ప్రజలు కూడా కార్మికులకు సహకరించి పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీను, ఈవోపీఆర్డీ కేవీ సుబ్బారావు, ఏఓ సిద్దారెడ్డి, ముచ్చింతాల సర్పంచ్ జక్కులూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో రైతులు

వత్సవాయి: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అధికవర్షాల నేపథ్యంలో పత్తిపంటను నష్టపోయిన రైతులు ఆ నష్టాన్ని కొంతవరకైనా తగ్గించుకోవాలనే ఆశతో మొక్కజొన్న సాగును చేపడుతున్నారు. నియోజకవర్గంలో ఖరీఫ్‌లో రైతులు 30వేల ఎకరాలలో పత్తి సాగుచేపట్టారు. మొదట్లో ఆశాజనకంగా ఉన్న పత్తి సెప్టెంబర్ నెలలో పడిన అధికవర్షాలకు పూత, పిందె మొత్తం రాలిపోయింది. పంట చేతికివచ్చే సమయంలో కురిసిన వర్షాలకు పత్తి తడిసి రంగు మారింది. పూత, కాయలు కుళ్లిపోయాయి. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరానికి ఐదు క్వింటాళ్లలోపే పత్తి దిగుబడి వచ్చింది. రైతులు ఎకరానికి కౌలు మినహా సుమారు 30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పెట్టుబడిలో సగం కూడా రాకపోవడంతో రైతులు తీరనినష్టం వాటిల్లింది. పత్తి పంట బాగాఉంటే జనవరి నెల చివరి వరకు పత్తితీతలు కొనసాగేవి. కానీ నవంబర్ నెల చివర్లోనే పత్తిపంట పూర్తికావడంతో ఎండిపోయిన పత్తి కట్టెను తొలగించి నీటివసతి ఉన్న భూముల్లో రైతులు మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. మొక్కజొన్న పెట్టుబడి తక్కువగా ఉండడంతోపాటు ప్రస్తుతం మార్కెట్లో క్వింటా ధర రూ.2000 పలుకుతోంది. దీంతో రైతులు మొక్కజొన్న సాగుకు ఆసక్తి చూపుతున్నారు.


వత్సవాయిలో సాగవుతున్న మొక్కొజొన్న పంట

21న శివసాయి క్షేత్రంలో పడిపూజ

కంచికచర్ల: స్థానిక శివసాయి క్షేత్రంలో ఈనెల 21న శుక్రవారం రాత్రి 7.30గంటలకు పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాంత్రిక శ్రేష్ఠ బ్రహ్మ కె.పద్మనాభన్ నంబూద్రి మంగళవారం తెలిపారు. 21వతేదీ తెల్లవారుజామున 4.30 గంటల నుంచి సుప్రభాత సేవ, గణపతిహోమం, మహాభిషేకం ఉష పూజ శాస్త గాయిత్రి హోమం, మధ్యాహ్నం 1.30గంటలకు పేటతుళ్ల, నగర సంకీర్తన, సాయంత్రం 7.30గంటలకు పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. కేరళ సాంప్రదాయ పద్ధతిలో 18 రకాల పుష్పాలతో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు గద్దె పావనిప్రసాద్ వివరించారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

సత్యసాయి జయంతి వేడుకలు ప్రారంభం



నందిగామటౌన్: స్థానిక సత్యసాయి ఆలయంలో మంగళవారం భగవాన్ సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. సత్యసాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామివారి పాదుకలకు అభిషేకం చేశారు. ముందుగా ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, మాతృశ్రీ ఈశ్వరమ్మ పల్లకీ సేవ, మంగళహారతి, వేద పఠనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. రాత్రికి నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. సత్యసాయి సేవాసమితి సభ్యులు వాసుదేవరావు, సరికొండ రవీంద్ర, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సమస్యల ఏకరువు

నందిగామటౌన్: పట్టణ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. పట్టణంలోని 15వ వార్డులో చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మీతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో పారిశుద్ధ్య సమస్య, కుక్కల బెడద అధికంగా ఉందని ప్రజలు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని, పైప్‌లైన్ లీకేజీ కారణంగా మురుగునీరు కలుస్తూ తాగునీరు కలుషితమవుతోందని, వార్డులోని తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయని ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవటం లేదని కమిషనర్‌కు వివరించారు.అనంతరం కమిషనర్ రమణబాబు స్పందిస్తూ ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయా విభాగాల మున్సిపల్ అధికారులను


15వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రమణబాబు

ఆదేశించారు. వార్డు అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను ఉన్నతాధికారులకు పంపించామని, అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం వార్డులోని అంగనవాడీ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, ఓర్సు జ్వాలా, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేటఅర్బన్):ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఇంగ్లిష్ మీడియం బోధనతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం తదితర మెరుగైన సౌకర్యాలను గురించి ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంఈవో ఎల్.చిట్టిబాబు సూచించారు.

స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో భాగంగా మంగళవారం మండలంలోని చిల్లకల్లు, ముక్త్యాల గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా సమావేశాల్లో ఎంఈఓ చిట్టిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సలహాలు,సూచనలను ఇచ్చారు. వీలైనంత ఎక్కువమంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు


చిల్లకల్లు సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో చిట్టిబాబు

ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో కృషిచేయాలని సూచించారు. ఆర్పీలు నంద్రు పుల్లయ్య, రవికుమార్, విద్యాసాగర్, మూర్తి, ఆంద్రేయ, పార్థసారధి, ముక్త్యాల హైస్కూల్ హెచ్ఎం. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భవితసెంటర్‌కు సీఐ ఆర్థిక సాయం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని సీతారామపురంలోని భవిత సెంటర్‌కు జగ్గయ్యపేట సీఐ పి.వెంకటేశ్వర్లు రూ.10వేలను ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు సీఐ వెంకటేశ్వర్లు, ఎంఈవో ఎల్.చిట్టిబాబు, ఎస్ఐ రాజు మంగళవారం భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు ఉదయలక్ష్మికి నగదును అందజేశారు. ప్రత్యేకావసరాలుగల చిన్నారుల కోసం ఆర్థికసాయం అందించిన సీఐ వెంకటేశ్వర్లుకు భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు, ఎంఈవో తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా కార్తికమాస ఉత్సవాలు


పేట పెద్దశివాలయంలో శివుడి ఆర్ట్ చుట్టూ దీపాలంకరణ చేస్తున్న భక్తులు


గ్రామోత్సవంలో స్వామివారు

జగ్గయ్యపేట అర్బన్: కార్తిక మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం(పెద్ద శివాలయం)లో మంగళవారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. శివుడు తదితర రూపాలతో భక్తులు చేసిన దీపాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. ఆలయ స్థానాచార్యులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ, ప్రధాన అర్చకులు పల్లెకూన కేశవప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా సాగాలి : ఎంపీడీవో


దర్మవరప్పాడు తండాలో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో నితిన్

చిల్లకల్లు(జగ్గయ్యపేటఅర్బన్):ఎన్‌పీసీఐ ఇంటింటి సర్వేలో ఖచ్చితత్వం, పారదర్శకత ఉండాలని జగ్గయ్యపేట ఎంపీడీవో జి.నితిన్ ఆదేశించారు. చిల్లకల్లు, తిరుమలగిరి, ధర్మవరప్పాడు తండా గ్రామ పంచాయతీల్లో మంగళవారం ఆయన పర్యటించారు. సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేను పర్యవేక్షించారు. సర్వే సజావుగా, పారదర్శకంగా సాగాలంటూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు.